మహాశివరాత్రి జాతరకు ఆహ్వానం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రావలసిందిగా పలువురికి ఈవో వినోద్ రెడ్డి ఆహ్వాన పత్రికలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజను కలిసి శివరాత్రి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదోక్తా ఆశీర్వాచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వస్త్ర పరిశ్రమల్లో సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న పదిశాతం రాయితీని విడుదల చేయించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణలు కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు కమిషనర్ శైలజరామయ్యార్‌లను కలిసి వస్త్ర పరిశ్రమల సమస్యలను విన్నవించి వినతిపత్రాలను అందించామని తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు నిరంతరం ఉపాధితోపాటు మెరుగైన వేతనాలు ఇప్పించాలని, కార్మికులకు రావాల్సిన పెండింగ్ యారన్ సబ్సీడీ డబ్బులను అందించి వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు శాశ్వత ఉపాధిని కల్పించాలని, సంక్షేమ పథకాలన్నింటిని కొనసాగించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు, నాయకులు పరిశ్రమల అభివృద్ధికి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అన్నల్‌దాస్ గణేష్, సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేష్ జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎట్టకేలకు రాయితీతో..

- ఎల్ఆర్ఎస్‌కు మరోసారి ప్రభుత్వం పచ్చజెండా
- జిల్లాలో 42,942 దరఖాస్తులు
- పరిష్కరించినవి 19,141 దరఖాస్తులు
- ఫీజు చెల్లించినవారు 172 మంది
- 25శాతం రాయితీ నిర్ణయంతో దరఖాస్తుదారులకు ఊరట

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అనుమతిలేని ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్)లో వచ్చిన దరఖాస్తులకు ప్రభుత్వం మరోసారి పచ్చజెండా ఊపింది. 25శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలతో అధిక సంఖ్యలోనే ముందుకు వచ్చే అవకాశం ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలతో పాటు 260 గ్రామపంచాయతీల పరిధిలో ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ కోసం 42,942 దరఖాస్తులు వచ్చాయి. 2020 సెప్టెంబరులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రజలపై మోయలేని భారం మోపిందనే అభిప్రాయంతో ఎవరూ దరఖాస్తులు చేసుకున్నా ముందుకు రానీ పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలు గ్రామపంచాయతీల్లో అక్రమ లేఅవుట్‌లు, రిజిస్ట్రేషన్లు లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు సెప్టెంబరు 1, 2020న బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 26 అగస్టు 2020లోపు సేల్‌డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసిన లే అవుట్‌ల యజమానులు, ప్లాట్ ఓనర్లకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించింది. కానీ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎప్పుడో 20 ఏండ్ల క్రితం ఇండ్లు నిర్మించుకొని ఇంటి పన్నులు చెల్లించి క్రయవిక్రయాలు జరిపిన వారు కూడా ఎల్ఆర్ఎస్ చెల్లించే పరిస్థితి నెలకొంది. లేనిపక్షంలో క్రయవిక్రయాలు జరిపే అవకాశం లేని పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎల్ఆర్ఎస్ పక్రియను వేగవంతం చేయడానికి నిర్ణయించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై ప్రకటనలు చేసి సర్వేలు చేయడానికి జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. గత సంవత్సరం జూలై నెలలో మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటి పారుదలశాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేక బృందాలను దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసింది. వాటిని పరిశీలించి పరిష్కరించే దిశగా దిశా నిర్దేశం చేసినా ఆశించిన మేరకు స్పందన రాలేదు. ఇతర సర్వేలతో దరఖాస్తుల పరిశీలన పూర్తికాలేదని తెలుస్తోంది. తాజాగా ప్రభుత్వం మార్చి 31లోపు దరఖాస్తు చేస్తే 25శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. లే అవుట్‌లలో కేవలం పది శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యి ఉండి, మిగిలినవి రిజిస్ట్రేషన్ కాకపోతే 90శాతం ప్లాట్లు క్రమబద్ధీకరణకు అనుమతించాలని నిర్ణయించారు. దీంతో దరఖాస్తుదారుల్లో కొంత ఊరట కనిపిస్తోంది. చాలామంది రియల్టర్లు అనుమతి లే అవుట్ ప్లాట్లు కొన్నవారు రూ 10వేల చొప్పున ఫీజు చెల్లించి దర ఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత రూ.1000 చొప్పున చెల్లించారు. ప్రస్తుతం రాయితీతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులో కదలిక వస్తుందని భావిస్తున్నారు.

● జిల్లాలో 42942 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు..

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చిన 42,942 దరఖాస్తుల్లో 19,141 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. ఇంకా 23,801 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. 172 దరఖాస్తులకు సంబంధించిన ఫీజులు చెల్లించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో 10,493 దరఖాస్తులు రాగా, 7,826 దరఖాస్తులు పరిష్కరించారు. 2,667 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 132 దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో 16,336 దరఖాస్తులు రాగా 10,055 దరఖాస్తులు పరిష్కరించారు. 6,281 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 40మంది దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు...

మిగతా 8లో

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



విద్యాశాఖ చైర్మన్‌కు వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మిడ్ డే మిల్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళికి తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులతో కలిసి జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మన్ వినతి పత్రం అందజేశారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం వర్కర్స్‌కు నెలకు రూ 10వేల వేతనం అమలుచేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షురాలు డి కమలారెడ్డి, ఉపాధ్యక్షురాలు తోపునూరు చక్రపాణి, నాయకులు పాల్గొన్నారు.

జాతర భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రజిత



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజని అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 25, 26, 27, తేదిలలో జరిగే మహా శివరాత్రి జాతర సందర్భంగా ప్రథమ చికిత్స కేంద్రాలలో విధులు నిర్వహించనున్న వైద్యులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. మహా శివరాత్రి జాతరను పురస్కరించుకొని సిబ్బంది ఎవరికి సెలవులు ఇవ్వడం జరగదన్నారు. జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందికి విధి నిర్వహణపై దిశా నిర్దేశనం చేశారు. సమావేశంలో మహా శివరాత్రి జాతర క్యాంప్ అధికారి డాక్టర్ సంపత్, ప్రోగ్రాం అధికార్లు డాక్టర్ రామకృష్ణ, అనిత, దివ్యశ్రీ, వైద్యాధికారులు, ఇబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిలోనే 50 వేల ఉద్యోగాలు భర్తీ..

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 50వేల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీలు పులి లక్ష్మీపతి గౌడ్, బోలుమాల శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు నాగుల వంశీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ..

- సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :వ్యవసాయ రైతులకు, పాడి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగిన కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి అమలుచేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పనిముట్లపై సబ్సిడీ ఇచ్చి అండగా ఉంటుందన్నారు. సంస్థలు వ్యవస్థలు రైతులను రెచ్చగొట్టి లబ్దిపొందాలని చూస్తే ప్రభుత్వ అధికార యంత్రాంగాలు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వ్యవస్థలు, సంస్థలు, వ్యాపార సంస్థలైన చట్టానికి లోబడి చట్టరిత్యా వారు తీసుకోవల్సిన అనుమతులను తీసుకొని వారు వ్యాపారాలు నడిపించుకొంటే ఎవరికి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామని వనిత, మాజీ కౌన్సిలర్లు కత్తెర దేవదాస్, ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.

భవన నిర్మాణరంగ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పక్కన జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

వేములవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పెన్షన్ అందజేయాలని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. వేములవాడ పట్టణంలో శుక్రవారం ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభ శుక్రవారం వేములవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భవన నిర్మాణం రంగంలో అనేకమంది కార్మికులు పనిచేస్తున్నారని, 10లక్షల రూపాయల వ్యయం దాటిన నిర్మాణానికి ఒకశాతం సెస్ చొప్పున కార్మికుల ప్రయోజనాల కోసం ప్రభు త్వం వసూలు చేసి ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే కార్మికులకు కూడా పెన్షన్ ఇవ్వాల్సిందని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర బిల్డింగ్ వర్క ర్స్ యూనియన్ ప్రదాన కార్యదర్శి మారగొని ప్రవీణ్ కుమార్, నాయకులు గుంటి వేణు, కడారి రాములు తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు నీటిని విడుదల చేయాలని రైతుల ధర్నా

ముస్తాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ పెద్ద చెరువు నీటిని విడుదల చేయాలని మండలంలోని పోతుగల్, గన్నెవానిపల్లె రైతులు గురువారం తెలంగాణ కూడలిలో ధర్నా చేశారు. మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఇరిగేషన్ డీఈఈ రవికుమార్ ఆధ్వర్యంలో ముస్తాబాద్, గన్నెవానిల్లె, పోతుగల్ తదితర గ్రామాల రైతులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. పొలాలన్నీ ఎండిపోతున్నాయని ఎల్లమ్మ వాగులోకి ముస్తాబాద్ పెద్దచెరువులో నిల్వ ఉన్న నీటిని విడుదల చేయాలని పోతుగల్, గన్నెవానిపల్లె రైతులు కోరగా, పెద్దచెరువులోకి పైనుంచి నీటి ప్రవాహం ఉంటేనే విడుదల చేయాలని ముస్తాబాద్ రైతులు పేర్కొన్నారు. చర్చలు ఫలించకపోవడంతో రెండు గ్రామాల రైతులు రోడ్డెక్కారు. తహసీల్దార్ సురేశ్ చేరుకొని పరిష్కారం అయ్యేలా చూస్తానని ధర్నాను విరమింపజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అధికారులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై 24జిల్లాల కలెక్టర్‌లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. రాజన్న సిరిస్లిల జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా గట్టి నిఘా పెట్టాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేయాలని, డబ్బు, మద్యం, ఇతర ఆభరణాలు పరికరాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంతో ఎప్పటికప్పుడు దాడుల నిర్వహిస్తూ వీటిని నిరోధించాలని అధికారులకు తెలిపారు. టీచర్స్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగే ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మేర సౌకర్యాలు ఉండే విధంగా చూడాలని, పోలింగ్ కేంద్రాలకు సంబంధిత అధికారులు వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు తనిఖీ చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, అక్కడ సీసీ కెమెరాలు లేదా నిరంతరాయంగా వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్రతి పోలింగ్ బృందానికి అవసరమైన మేర పోలింగ్ సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పోస్టల్ బాక్స్ అందేవిధంగా చూడాలని, వీటి తరలింపునకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు అందించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ వివరాలను ప్రకటించాలని తెలిపారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 22వేల 397మంది, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 950 మంది ఓటర్లతో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 28 పోలింగ్ కేంద్రాలు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 13 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రిజర్వ్ సహా మొత్తం 181 మంది సిబ్బందిని నియమిచామని, వీరికి అవసరమైన శిక్షణ అందించమన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు రాజేశ్వర్ రాధాబాయి డిఆర్‌డీవో శేషాద్రి జసీఈవో వినోద్ కుమార్ డీడబ్ల్యువో లక్ష్మీరాజం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం పరీక్షలను నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లాలో మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇంటర్మీడియేట్, మార్చి 21నుంచి ఏప్రిల్ 4 వరకు పదవ తరగతి పరీక్షలను నిర్వహిస్తామని దీనికి తగిన ఏర్పాట్లుచేయాలని అన్నారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 5065 మంది విద్యార్థులు ఉండగా, సెకండ ఇయర్‌లో 4245 మంది విద్యార్థులు మొత్తం 9310 మంది పరీక్షలకు హాజరవుతారని, ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 16 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం మొదటి సారీగా ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల అడ్రస్‌లు రూట్ మ్యాప్ వివరాలు తెలిసే విధంగా హాల్ టికెట్‌పై క్యూఆర్ కోడ్‌లను ముద్రిస్తామన్నారు. పదవ తరగతి పరీక్షలకు 3051మంది బాలురు, 3717 మంది బాలికలు మొత్తం 6768మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, వీటి నిర్వహణకు 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరిండెంట్, ఒక డిపార్ట్మెంట్‌లో అధికారి, స్టేట్ లెవెల్ అబ్జర్వర్, ఫ్లయింగ్‌స్వాడ్, వర్ద్ సిట్టింగ్ స్క్వేర్‌లను నియమించామన్నారు. పరీక్షలను ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలను కల్పించాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను అదేశించారు.

సమావేశంలో ఆర్డీవోలు రాధాభాయ్, రాజేశ్వర్, జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ధర్మదర్శనం, బ్రేక్‌దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లో భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): : కర్ణాటక రాష్ట్రంలో బేడ బుడగ జంగాల మహిళలపై అఘాయిత్యానికి పాల్పడి హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం నాయకుడు రాజేష్ డిమాండ్ చేశారు. రాచర్ల గొల్లపల్లిలో ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల నిరసన ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి
యువకుడి ఆత్మహత్య


దామోదర్ (ఫైల్)

ఓదెల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన గూడ దామోదర్(30) అనే డిగ్రీవిద్యార్థి గురువారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం పోత్క పల్లి పోలీసులకు మృతుడి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డిగ్రీవరకు చదువుకున్న దామోదర్ ఇంటివద్దనే ఉంటూ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడని తెలిపారు. గురువారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గ్రామంలో, పంటచేల వద్ద వెతికారు. మొక్కజొన్న చేను వద్ద పురుగుల మందుతాగి మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోత్కపల్లి ఎస్సై రమేష్ తెలిపారు.

గోదావరిఖనిలో ఆటో డ్రైవర్..

కోల్‌సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్ ఏరియాలో నివాసముండే ఆటో డ్రైవర్ కర్రావుల శ్రీనివాస్(55) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన శ్రీనివాస్ ఇంటి వ్యవహారాలు పట్టించుకునే వాడు కాదని, శుక్రవారం ఇంట్లో సరుకులు తీసుకురావడం లేదని భార్య పద్మ అన్నందున గొడవపడ్డట్లు పోలీసులు తెలిపారు. పద్మ అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుంది. ఆమె బయటకు వెళ్లడంతో అతడు ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. అతనికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

మనస్తాపంతో ఒకరు..


శంకర్ (ఫైల్)

పాలకుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి గ్రామానికి చెందిన రావుల శంకర్(59) గురువారం రాత్రి తన ఇంటి సమీ పంలోని వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ మూత్ర సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. యేడాదిక్రితం చికిత్స చేయిం చినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్ప డినట్లు మృతుడి కుమారుడు సతీష్‌కుమార్ తెలిపాడు. శుక్రవారం మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

అడవిపంది దాడిలో సీఆర్‌పీకి గాయాలు

గన్నేరువరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగపల్లి జడ్పీహైస్కూల్ కాంప్లెక్స్‌లో సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్న గాలిపల్లి వనిత శుక్రవారం అడవిపంది తగిలి గాయపడింది. ఆమె జంగపల్లి నుంచి గన్నేరువరంకు స్కూటీపై వెళుతుండగా మాదాపూర్ సమీపంలోని మామిడితోట నుంచి అడవిపంది వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వనిత కిందపడిపోగా తలకు, కాలికి తీవ్రంగా గాయాలయ్యాయి. సమీప రైతులు, గ్రామస్తులు అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆమెను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు

వీర్నపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది మద్దిమల్ల, రంగం పేట, అడవిపదిర గ్రామాల్లో ఉన్న గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీ అనుమాని తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎస్ఐ శైలజ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం లారీతో అధికారులు

ఓదెల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న 233 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం హైదరాబాద్ విజిలెన్స్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సివిల్ సప్లయిస్ డిటిసిఎస్ మహేష్ మాట్లాడుతూ, ఓదెల శివారులో శుక్రవారం తెల్లవారుజామున రెండు బొలేరో వాహనాల నుంచి లారీలో బియ్యం బస్తాలను లోడ్‌చేస్తున్నట్లు పక్కా సమాచారం అందిందన్నారు. అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా లారీ, రెండు బొలేరో వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం లోడ్‌తో ఉన్న లారీ మహారాష్ట్రలోని గోండియాకు వెళ్లేందుకు 350 బస్తాలను లోడ్ చేశారని తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకొని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. అలాగే పట్టుబడ్డ మూడువాహనాలను సీజ్ చేశామని, రెవెన్యూ చట్టం 6ఏ కింద నిందితులపై కేసులను నమోదు చేయాలని డిటిసిఎస్ మహేష్ పొత్కపల్లి ఎస్సై రమేష్ కు ఫిర్యాదు చేశారు.

ఉల్లంపల్లిలో రేషన్ బియ్యం..

చిగురుమామిడి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో శుక్రవారం 6క్వింటాళ్ల50కిలోల పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై బండిరాజేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉల్లంపలి గ్రామబస్టాండ్ వద్ద ఉదయం 8 గంటలకు ఏపీ15టిఏ 7630 మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్, ఓనర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు 18 నెలల కఠిన కారాగార శిక్ష

ధర్మపురి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా లారీ నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ శ్యాంప్రసాద్ శుక్రవారం 18నెలలు కఠిన కారాగార శిక్ష, 5,500రూపాయల జరిమానా విధించారు. ధర్మపురిసీఐ రాంనర్సింహా రెడ్డి శుక్రవారం వివరాలను వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన అక్కల సతీష్, గటికె క్రిష్ణమూర్తి అనే ఇద్దరు వ్యక్తులు 2018 మే రెండోతేదీన ద్విచక్రవాహనంపై రామయ్యపల్లె నుంచి రాయపట్నంవైపు వెళ్తున్నారు. ధర్మపురి నుంచి రాయపట్నం వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ జాగిరి మల్లేష్ వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. వెనుక కూర్చొని ఉన్న గటికె కృష్ణమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటి విచారణ అధికారి లక్ష్మీనారాయణ కేసు నమోదుచేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేసినట్లు ఆయన వివరించారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రాసిక్యూటర్ బి. రాజేష్ వాదించగా ఎస్ఐ ఉదయ్‌కుమార్ సూచనల మేరకు కోర్టు కానిస్టేబుల్ రాము సాక్ష్యులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ శ్యాంప్రసాద్ శిక్ష విధించి జరిమానా వేసినట్లు సీఐ వివరించారు.

ఆటల్లో 'ఆదర్శం'

ఒకే పాఠశాల నుంచి 200కు పైగా విద్యార్థులు రాణింపు

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాల పంట

కొందరికి స్పెషల్ గేమ్‌గా ఒక్కో ఆట

రెండేసి గేముల్లో సత్తా చాటుతున్న మరి కొందరు విద్యార్థులు


ఆటల్లో రాణిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్నారు ధర్మారం మండల ఆదర్శ పాఠశాల విద్యార్థులు. ఒక్కరు ఇద్దరు కాదు ఒకే పాఠశాలలో ఏకంగా ఇప్పటి వరకు రెండు వంద లకు పైగా విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ల్లో రాణిస్తూ అందరికి "ఆదర్శంగా" నిలుస్తున్నారు.

ధర్మారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్నారు. ఈ పాఠశాలలో 637 మంది విద్యార్థులు ఉండగా ఇప్పటి వరకు రెండు వందలకు పై చిలుకు విద్యార్థులు వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్ ప్రేరణ, వ్యాయామ ఉపాధ్యాయుల బైకని కొమురయ్య, మేకల సంజీవ్‌ల శిక్షణతో ఆటల్లో రాణిస్తున్నామని విద్యార్థులు చెప్పుతున్నారు. కొందరు విద్యార్థులు వారి స్పెషల్ గేమ్‌గా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బేస్‌బాల్, సాఫ్ట్ బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్‌లో రాణిస్తుండగా మరి కొందరు విద్యార్థులు రెండు మూడు రకాల ఆటల్లో సత్తాచాటుతూ పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ఆడగా, స్టేట్ లెవల్లో 60 మంది, 2 వందలకు పైగా జిల్లా స్థాయిల్లో ఆడి అందరిని అబ్బుర పరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పోలీస్ అవుతా: తుమ్మల మనోజ్ఞ (9వ, తరగతి)



నాకు చిన్న నాటి నుంచే ఆటలంటే ఇష్టం. ఫుట్‌బాల్ ఆడడం ఇష్టం. పీఈటీ రోజు శిక్షణ ఇస్తారు. నేను ఇప్పటి వరకు 8సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ స్థాయిలో మెడల్స్ పొందాను. భవిష్యత్తులో పోలీస్ డిపార్టమెంట్‌లో ఉద్యోగం చేయడమే లక్ష్యం.

చదువుతోపాటు ఆటలు : బైకని శరణ్య ఇంటర్ ఫస్ట్ ఇయర్



మా పాఠశాలలో చదువుతో పాటు ఆటలు నేర్పిస్తున్నారు. రోజు ఆటలు ఆడే వారి కోసం కొంత సమయం కేటాయించి ప్రాక్టీస్ చేయిస్తారు. అథ్లెటిక్ తోపాటు ఫుట్ బాల్ ఆడుతాను. ఎస్‌జీఎఫ్ అండర్ 19లో జాతీయ స్థాయిలో మణిపూర్‌లో పాల్గొన్న.

ఆర్మీలో చేరి దేశ సేవ చేస్తా అచ్చె రంజిత్, 10వ తరగతి



నాకు అథ్లెటిక్ అంటే చాలా ఇష్టం. ధర్మారం మోడల్ స్కూల్‌కి వచ్చాక చదువుతో పాటు ఆటల్లో పాల్గొంటున్న. ఎస్‌జీఎఫ్ అండర్ 17లో తెలంగాణ తరుపున పాట్నాలో ఆడాను. భవిష్యత్తులో ఆర్మీలో చేరి దేశ సేవ చేయాలని ఉంది.

సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ రెండూ ఆడతా.. బండి వైష్ణవి (ఇంటర్ ఫస్ట్ ఇయర్)



నేను సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ రెండూ ఆడుతా. ఆటల్లో రాణించడం వల్ల ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభిస్తుంది. ఎస్‌జీఎఫ్ అండర్ 19లో జాతీయ స్థాయిలో మహారాష్ట్రలో ఆడాను.

క్రీడా స్థలం ఏర్పాటు చేయాలి: బైకని కొమురయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు



ప్రిన్సిపాల్ సహకారంతో పాఠశాలలో చాల మంది విద్యార్థులు ఆటల్లో రాణిస్తున్నారు. ఆటలకు క్రీడా స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాఠశాల ఆవరణలో 400 ట్రాక్ నిర్మిస్తే జాతీయ స్థాయిలో రాణించే సత్తా మా విద్యార్థులకు ఉంది. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రత్యేకంగా పౌష్టిక ఆహారం అందించాలి.

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు

● అయిదుగురికి గాయాలు

మల్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంఓనిని రాజారం సమీపంలో రెండు ద్విచక్రవాహనాలను కారు ఢీకొట్టగా అయిదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో గుర్తుతెలియని కారు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. దీంతో జగిత్యాల టీఆర్ నగర్‌కు చెందిన దండుగుల లక్ష్మణ్, పోటే భీం, సమీర, మాచర్ల నరేశ్, తాండ్ర శివకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. కాగా ద్విచక్రవాహనాలను ఢీకొట్టిన కారు వేగంగా ముందుకు వెళ్లిపోగా పోలీసులు కారు కోసం రహదారిపైగల సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రాములపల్లిలో ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

పెగడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాములపల్లి స్టేజి వద్ద శుక్రవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రమేష్ పెగడపల్లి నుంచి చిల్వాకోడూరు వైపు వెళ్తుండగా రాములపల్లి గ్రామానికి చెందిన అడుప నందయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనం ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో అడుప నందయ్య కాలు విరగగా వెంటనే అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లండన్‌లో సీట్ ఇప్పిస్తానని మోసం..

● సైబర్ నేరస్తుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో ఉన్నత చదువుల కోసం యూనివర్సిటీలో సీటు ఇప్పిస్తానని మోసం చేసిన సైబర్‌నేరస్తుడు షణ్ముక కృష్ణయాదవ్‌ను పోలీసులు హైదారాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో సీఐ నిరంజన్ రెడ్డి విలేకరులసమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన విద్యార్థి మామిడాల నితీష్‌కుమార్‌కు టెలిగ్రామ్ యాప్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి పట్టణానికి చెందిన షణ్ముక కృష్ణయాదవ్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో కృష్ణయాదవ్ తాను లండన్‌లో చదివి ఉద్యోగం చేస్తున్నానని మాయమాటలు చెప్పి అక్కడికి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లుచేస్తానని నమ్మించాడు. లండన్‌లో డబ్బులు కడితే ఎక్కువగా ఫీజు అవుతుందని, భారత కరెన్సీని లండన్ కరెన్సీలోకి మార్చికడితే తక్కువ ఫీజు అవుతుందని నమ్మించాడు. దీంతో నితీష్ తల్లి మామిడాల లత కృష్ణయాదవ్ అకౌంట్‌కు ఆరు లక్షల రూపాయలు పంపించారు. పలుమార్లు సీటు విషయమై కృష్ణ యాదవ్‌ను సంప్రదించగా ఇప్పుడుఅప్పుడు అంటూ దాటవేసి చివరకు ఫోన్ స్విచ్ అఫ్ చేయడంతో మోసపోయానని నితిష్ గ్రహించాడు. దీంతో మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కోర్టు నుంచి పర్మిషన్ తీసుకొని జిల్లా ఎస్పీ ద్వారా ఎల్‌వోసీ (లుకౌట్ సర్కిల్) పంపించారు. ఈ నెల 20న నిందితుడు లండన్ నుంచి హైదారాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి రాగా ఎయిర్ పోర్ట్‌లో ఇమిగ్రేషన్ అధికారులు కృష్ణ యాదవ్‌ని గుర్తించి మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డికి తెలిపారు. సీఐ వెంటనే మల్లాపూర్ ఎస్ఐ రాజును హైదారాబాద్ విమానాశ్రయం పంపి అక్కడ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో శుక్రవారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో మల్లాపూర్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్లో విద్యార్థులపై దాడి చేసిన సీనియర్లు

●ఆందోళన నిర్వహించిన తల్లిదండ్రులు ● శాంతింపజేసిన పోలీసులు


ఎస్సైకి దాడి ఘటనను వివరిస్తున్న విద్యార్థులు

చొప్పదండి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమగురుకుల సైనికస్కూల్‌లో గురువారం రాత్రి విద్యారుల మధ్య గొడవ జరిగింది. పదవతరగతి విద్యార్థులపై ఇంటర్‌విద్యార్థులు దాడిచేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలుకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి కొంత మంది ఇంటర్ విద్యార్థులు నలుగురు పదవ తరగతి విద్యార్థులపై దాడిచేసి గాయపరిచారు. కర్రలతో దాడి చేయగా కొంతమంది పదవ తరగతి విద్యార్థుల కాళ్లకు, వీపుపై గాయాలు అయ్యాయి. ఒక విద్యార్థి కంటికి గాయం అయ్యింది. తమపై సీనియర్లు దాడిచేశారని పదవ తరగతి విద్యార్థులు రాత్రి డ్యూటీలో ఉన్న ఇన్‌స్ట్రక్టర్లకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినందుకు మరోసారి దాడిచేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు గాయపడ్డ విద్యార్థులను రాత్రి కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. దాడి సంఘటన తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం స్కూల్‌కు చేరుకొని ఆందోళన నిర్వహించారు. తమపిల్లలపై దాడికి పాల్పడ్డ విద్యార్థులను స్కూల్ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. అసలు స్కూల్‌లో ఏం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలను చితకబాదిన సంఘటనలు తరుచూ జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తమ పిల్లలకు ప్రాణహాని ఉందని వెంట తీసుకెళ్తామని తల్లిదండ్రులు తెలిపారు. కాగా మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూస్తామని దాడికి పాల్పడ్డ విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ తెలుపగా ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళనను విరమించారు. కాగా విద్యార్థులు దాడులకు పాల్పడవద్దని భవిష్యతును పాడు చేసుకోవద్దని ఎస్ఐ అనూష కౌన్సెలింగ్ చేశారు. స్కూల్‌లో జూనియర్లపై సీనియర్లు దాడిచేసిన సంఘటన ఇదిరెండోసారి కావడం గమనార్హం.

చికిత్స పొందుతూ దినసరి కూలీ మృతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో అద్దెకు ఉంటున్న దినసరి కూలీ రాగుల దేవయ్య(42) రోడ్డు ప్రమాదంలో గాయ పడి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడని స్థానికులు, కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. గ్రామస్తులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి గ్రామానికి చెందిన దేవయ్య ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లికి వలస వచ్చాడు. గ్రామంలో ఓగదిని అద్దెకు తీసుకుని భార్య రజితతోకలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆరు నెలల క్రితం సిరిసిల్లకు వెళ్లి బండలింగంపల్లికి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. 15 రోజుల క్రిం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలం రామన్నపల్లికి తరలించారు.

భార్యపై హోంగార్డు హత్యాయత్నం..

కోల్‌సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముండే రాజేశ్వరి అనే మహిళపై ఆమె భర్త హోంగార్డు గట్టయ్య శుక్రవారం హత్యాయత్నానికికు పాల్పడ్డాడు. భార్యపై దాడిచేసి ఆమె తలను గోడకు కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్టు తెలుస్తుంది. గట్టయ్య గోదావరిఖని యూనిట్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు.

గుట్టు చప్పుడు కాకుండా విచారణ?

వీర్నపల్లి, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'ఉడకని అన్నం, కుళ్లిన కూరగాయలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ, టాస్క్‌ఫోర్స్ విచారణ చేపట్టినట్టు తెలిసింది. విచారణలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సమస్యలు బయటకు తెలియకుండా ఉండాలని విద్యార్థులను విద్యాశాఖ అధికారులు హెచ్చరించినట్లు సమాచారం. అధికారుల విచారణ కొనసాగుతున్న సమయంలో లోపలికి ఎవరిని అనుమతించకుండా పాఠశాల గేట్లకు తాళాలు వేయడం గమనర్హం.

పాపతో కలిసి ఆత్మహత్యకు సిద్ధమైన వివాహిత

● పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

● కాపాడిన పోలీసులు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నక్క సువర్ణ తన కూతురు కనపడడం లేదని ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఎస్ఐ రాజకుమార్ ఇంట్లో నుంచి వెళ్లిపోయిన రుచితను పట్టుకొని తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసేడు గ్రామానికి చెందిన పల్లెర్ల రుచిత అదే గ్రామానికి చెందిన అరవింద్ రెండేళ్లక్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరిద్దరికి పదినెలల పాప ఉంది. కానీ కొన్నినెలల క్రితం వీరిద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె అప్పటినుంచి పుట్టింట్లోనే ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15గంటలకు తల్లిని ఒక వంద రూపాయలు కావాలని అడగగా తీసుకొమ్మని తల్లి సువర్ణ చెప్పింది. కొద్ది సేపటికి ఇంట్లో నుంచి వెళ్లి ఫోన్ స్విచ్చాఫ్ చేసింది కూతురు. ఇరుగు పొరుగు వారిని అడుగగా తెలియదని చెప్పారు. దీంతో ఆమె వెంటనే పోలీస్ స్టేషన్లో 2:30గంటలకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందిన వెంటనే ఎస్ఐ రాజకుమార్ మొబైల్‌ఫోన్ ట్రాప్ చేసి లోకేషన్‌కి వెళ్లి వెతికారు. జమ్మికుంట మండలం పెద్దంపల్లి శివారులో 3:30గంటలకు కనబడింది. ఎస్ఐ ఆమెను విషయం అడగగా నా భర్తకు నాకు గొడవ జరిగిందని జీవితంపై విరక్తి చెంది నా పాపతో చావడానికి సిద్ధపడి వచ్చానని పేర్కొంది. వెంటనే ఎస్ఐ రాజకుమార్ ఆమెను, కూతురిని కాపాడి స్టేషన్‌కు తీసుకువచ్చారు. భర్త అరవింద్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లి సువర్ణకు అప్పగించారు. గంటవ్యవధిలో తన కూతురు, మనమరాలును కాపాడి అప్పగించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

3500క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసిన సీసీఐ

● 12రోజుల తర్వాత ఎట్టకేలకు ప్రారంభం

● సంతోషం వ్యక్తం చేస్తున్నరైతులు


ఆన్‌లైన్‌లో రైతుల వివరాల నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

జమ్మికుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఎనిమిది జిన్నింగ్ మిల్లుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఎట్టకేలకు కొనుగోళ్లు పునః ప్రారంభించింది. శుక్రవారం ఒక్కరోజు సీసీఐ 3500క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు చేపట్టింది. సర్వర్‌డౌన్‌తో పన్నెండు రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిన విషయం తెలిసిందే. సీసీఐ రీఎంటర్‌తో రైతులకు ప్రభుత్వ మద్దతు ధర దక్కింది. 14మంది రైతులు 82క్వింటాళ్లు మాత్రమే ప్రైవేట్ ట్రేడర్స్‌కు గరిష్ఠధర రూ.6800, కనిష్ఠధర రూ.5వేల చొప్పున పత్తి విక్రయించారు. మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలు సుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులు ఇంటివద్దనే పత్తిఆరబెట్టి యార్డుకు తీసుకురావాలని, నాణ్యమైన పత్తికి ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

- కార్యకర్తలు తమ పౌరుషాన్ని చూపాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, పక్కన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, నాయకులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలంతా తమ పౌరుషాన్ని, దమ్ము చూపాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన బీజేపీ పచ్చీస్ ప్రభారీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని ఒక్కసారైనా అధికారంలోకి తీసుకు రావాలనేది లక్షలాది మంది కార్యకర్తల ఆశయమన్నారు. మావోయిస్టుల తూటాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ నాయకులకే ఉందని, పెద్దపల్లి జిల్లాలోనూ గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, కాసిపేట లింగయ్య, కోమల అంజనేయులు వంటి నేతలను చంపాలని మావోయిస్టులు పోస్టర్లు సైతం అంటించారని గుర్తు చేశారు. అయినా భయపడకుండా కాషాయ జెండాను రెపరెపలాడించిన చరిత్ర తమదని చెప్పుకోవడానికి గర్వంగా ఉందన్నారు. రిజర్వేషన్ల పేరుతో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తుందన్నారు. మన సంప్రదాయాలు వేరని అలాంటి సందర్భంలో హిందువుల జాబితాలో ముస్లింలను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఒకవైపు బీసీ జనాభాను తగ్గించి చూపుతున్నారని, ఇంకోవైపు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించడం కాంగ్రెస్ పార్టీ కుటిలనీతికి నిదర్శనమన్నారు. బీసీలకు ద్రోహం చేస్తుంటే ఎట్లా ఊరుకుంటామని, బీసీ జాబితాలో ముస్లింలను కలిపి బిల్లు పంపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదని బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కాసిపేట లింగయ్య, టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిన్నరలో 56వేల ఉద్యోగాలిచ్చాం

- ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పక్కన విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

ధర్మపురి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోగా 56 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ధర్మపురి పట్టణంలో నియోజకవర్గస్థాయి పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ నిరుద్యోగుల నైపుణ్యాన్ని పెంచే విధంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. 317 జీవో సడలింపుపై న్యాయ నిపుణులతో సంప్రదిస్తున్నామని, మేనిఫెస్టోలో చెప్పిన విధంగా డీఎస్సీ నిర్వహించి, ఉద్యోగ నియామకాలు చేపట్టామని గుర్తు చేశారు. ఓటమి భయంతోనే నరేందర్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. విద్యావేత్త, అల్ఫోర్స్ యజమాని నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త గడపగడపకు వెళ్లి పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుక వెళ్లాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వూట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అయన కోరారు. ప్రైవేట్ స్కూల్ టీచర్లకు రూ 3 లక్షలు ఇన్సూరెన్స్ చేయించేందుకు తన సొంత నిధులు ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. గెస్ట్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నరేందర్‌రెడ్డికి మద్దతు ప్రకటించి లేఖను మంత్రికి అందించారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహుడి సన్నిధిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పూజలు నిర్వహించారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు

ఎమ్మెల్సీ ఎన్నికల వేడెక్కుతున్న ప్రచారం



- రంగంలో దిగిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- అంజిరెడ్డికి అండగా బండి సంజయ్‌కుమార్
- కాంగ్రెస్ అభ్యర్థికి అండగా శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్
- ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా పట్టభద్రుల సింహగర్జన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మరో ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉండగా కాంగ్రెస్, బీజేపీ తమ అభ్యర్థి గెలుపు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ రంగంలోకి దిగగా, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డిని గెలిపించే బాధ్యత రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తమపై వేసుకొని నియోజకవర్గంలో రాజకీయవాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు.

ఈ రెండు స్థానాల పరిధి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్నా నియోజకవర్గంలోని 45శాతం ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఉండడంతో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మంత్రులు ఈ జిల్లాపైనే దృష్టి సారించి వివిధ వర్గాల ఓటర్లను కలిసి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌లోనే మకాం వేసి మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో సమావేశాలు నిర్వహించారు. పార్టీ నేతలను ఇప్పటికే రచించి పెట్టిన కార్యాచరణను అమలు చేసేందుకు క్షేత్రస్థాయికి పంపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ ఆశించి అది రాకపోవడంతో ప్రచారానికి దూరంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డిని సంజయ్ కుమార్ కార్యక్షేత్రంలోకి దిగేలా చేశారు. మరో ఆశావహుడు రఘునాథ్‌రావును కూడా అంజిరెడ్డికి మద్దతుగా పనిచేసేలా చూసి అభ్యర్థి విజయానికి ఆటంకాలను తొలగిస్తూ వస్తున్నారు.

రాష్ట్రమంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఇప్పటికే జిల్లాలో రెండు, మూడుసార్లు పర్యటించి ఎమ్మెల్యేలను, ఇతర ముఖ్యనేతలందరినీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం చేసి బాధ్యతలను అప్పగించారు. వీరివురు జిల్లాలోని వివిధ వర్గాల ప్రముఖులను కలుస్తూ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు కూడగడుతున్నారు.

ఇప్పటికే పలువృత్తి సంఘాల నేతలతో చర్చించిన రాష్ట్రమంత్రులు ఐఎంఏ న్యాయవాదులు, ముస్లిం మైనార్టీ పెద్దల సమావేశాలను నిర్వహించారు. రెండు పార్టీలు కూడా పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను తీసుకొని 25 లేక 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జీ, ఇద్దరు సహాయకులను నియమించి వారిని కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించాయి. ఓటర్లందరి ఫోన్‌నెంబర్లను కూడా సేకరించిన పార్టీలు మెస్సెజీలు, వాట్సాప్ సందేశాల ద్వారా, వీడియోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాయి. వారందరికీ ఆన్‌లైన్‌లో డబ్బు పంపించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గ్రామ కమిటీల ద్వారా ఓటర్లకు నేరుగా డబ్బు పంపించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారని కూడా చర్చించుకుంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తమ అభ్యర్థులను గెలిపించు కోవడం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుండగా ఒకరిద్దరు అభ్యర్థుల నుంచి గట్టి పోటీ ఎదుర్కోవలసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేడు పట్టభద్రుల సింహగర్జన

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రసన్న హరికృష్ణ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయడం కోసం ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం చివరి వరకు ప్రయత్నించారు. ఏఐసీసీ స్థాయిలో కూడా ఆయన పేరు పరిశీలనకు వచ్చినా చివరికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి వైపే అధిష్ఠానవర్గం మొగ్గుచూపించింది. ఆయనను అభ్యర్థిగా ఖరారు చేయడంతో ప్రసన్న హరికృష్ణ ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసినా చివరికి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. హరికృష్ణకు మద్దతుగా పలు ప్రజాసంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రుల సింహగర్జన పేరిట కరీంనగర్‌లో శనివారం భారీ సమావేశం ఏర్పాటు చేశారు. 53 సంఘాల ప్రతినిధులు హాజరవుతారని, ఉమ్మడి జిల్లా పరిధిలోని పట్టభద్రులు దీనికి హాజరవుతారని ప్రచారం జరుగుతున్నది. ప్రొఫెసర్‌గానే కాకుండా వివిధ పోటీ పరీక్షల పుస్తకాల రచయితగా, పబ్లిషర్‌గా ప్రసన్న హరికృష్ణ పట్టభద్రుల్లో చిరపరిచితులుగా ఉన్నారు. ఇది ఆయనకు కలిసి వచ్చే అంశంగా మారింది.

బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇరువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ప్రసన్న హరికృష్ణ బీసీ నినాదాన్ని తెరపైకి తెచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు ఆయన ప్రధాన పోటీదారుగా మారారు. చివరి వరకు బీఆర్ఎస్ టికెట్ ఆశించి పార్టీ పోటీ చేయకూడదని నిర్ణయించడంతో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు కూడా ప్రచారంలో దూకుడుగానే వ్యవహరిస్తున్నారు.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా 15 మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలో నిలిచిన పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్ అభ్యర్థిగా పోటీలో నిలిచిన వై.అశోక్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఎస్టీయూ, జాక్టో మద్దతుతో టీచర్లను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రిషిత్, హర్ష అనే విద్యార్థులు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనగా వారిని ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు షాబుద్దీన్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



నితిన్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ సంతోష్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం సిద్ధార్థ హై స్కూల్ విద్యార్థి నితిన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం విద్యార్థి నితిన్‌ను కరస్పాండెంట్ నాగుల సంతోష్ అభినందించారు. ఈనెల 16న ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలో కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. పోటీ ల్లో సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థి నితిన్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 21 నుంచి 23 వరకు వికారాబాద్‌లో జరగనున్న 34వ సబ్ జూనియర్స్ కబడ్డీ టోర్నమెంట్‌కు జిల్లా జట్టు నుంచి నితిన్ పాల్గొననున్నా డు. కార్యక్రమంలో సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్స్ బిజ్జుదేవన్న, మాటిన్ లూథర్, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు

- 12 లక్షల వరకు పన్ను మినహాయింపు
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

కరీంనగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): వికసిత్ భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం వికసిత్ భారత్ బడ్జెట్-2025-26 కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఆమె ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ స్థితిగతిని మార్చే విధంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు.

అభివృద్ధి పెట్టుబడుల సాధన లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అద్భుతమైన బడ్జెట్‌ను రూపొందించారన్నారు. మధ్య తరగతి వారికి 12 లక్షల వరకు పన్ను మినహాయింపు కోట్లాది మందికి ఊరట నిచ్చే అంశమన్నారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం జరిగే కేటాయింపులు ఉన్నాయన్నారు. రక్షణ, విద్య, వైద్యం, వ్యవసాయం, స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే స్వచ్ఛత, నిజాయితీ ప్రశ్నార్థకమన్నారు. బీసీల్లో ముస్లింలను కలిపి మతపరమైన రిజర్వేషన్లు ఆపాదించి బీసీలకు అన్యాయం చేస్తున్నారని ప్రజలు ఆలోచించాలన్నారు. కేంద్రం బీసీలకోసం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టి, పనిముట్లు, రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాని మోదీని లీగల్లీ కన్‌వర్టడ్ బీసీ అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 1994లో బీసీ కమిషనన్‌కు రెఫర్ చేసి బీసీ జాబితాలో చేర్చారని, అప్పుడు మోడీ సీఎంగా కూడా లేరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

బీజేపీ ప్రభుత్వం డాక్టర్ అంబేద్కర్‌ను అన్ని విధాల గౌరవించేలా ఆయన ఉన్న ప్రదేశాలను పంచతీర్థాలుగా అభివృద్ధి చేస్తున్నదన్నారు. బీజేపీ అధికారంలోనే అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చిందని, 2025-26 బడ్జెట్ పేద, మధ్య, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేదిగా ఉందని కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ అంబేద్కర్‌కు ఇచ్చిన నివాళిగా పరిగణించాలన్నారు. జన్‌ధన్ యోజన పథకంతో 80 కోట్ల మంది బ్యాంకింగ్‌కు అనుసంధానం అయ్యారన్నారు. అందులో 80 శాతం మహిళలు ఉన్నారన్నారు. కోవిడ్ సమయంలో ప్రారంభించిన గరీబ్ కల్యాణ్ యోజన పథకంతో పేదలకు ఇప్పటికీ ఉచిత బియ్యం అందుతుందన్నారు. పీఎం అవాస్ యోజన పథకంతో పేదలకు ఇళ్ల పంపిణీ జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంతో పేదలకు వైద్యం అందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథ కాన్ని అమలు చేయకుండా పేదలను వంచిస్తున్నదన్నారు. జలజీవన్ మిషన్‌కింద కేంద్రం మంజూరు చేసిన ప్రతి ఇంటికి నల్లాక నెక్షన్‌లను కేంద్రం అందిస్తున్నదన్నారు. స్వచ్ఛ భారత్ పథకంతో పాటు, రైతుల పెట్టుబడి సాయం కింద పదివేల రూపాయలను రైతులకు అందిస్తున్నదన్నారు. అసంఘటిత కార్మికులకు ఈశ్రామ్ కార్డులు, యువశక్తిలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు కోట్లాది రూపాయలు కేంద్రం విడుదల చేస్తున్నదన్నారు.

దేశ వ్యాప్తంగా ఐఐటీలు, ఏయిమ్స్ వైద్యశాలలు, ఐఐఎంలు ఫసల్‌బీమా యోజన పథకాలు, గోకుల్ మిషన్ పథకం కింద గోవులను అందించారన్నారు. సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపులు, మాతృత్వసురక్ష యోజన, గ్యాస్ కనెక్షన్‌లు, పేదలకు నామమాత్రం రేట్లకు ఔషధాలు అందించే విధంగా జన ఔషధి కేంద్రాలు ఏర్పా టుచేశామన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నదన్నారు. బడ్జెట్ కేటాయింపులు ప్రతిపక్షాలకు కొన్ని వర్గాలకు భయం కలిగించిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మనోహర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ వై సునీల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మహా జాతరకు భారీ ఏర్పాట్లు

- 4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- రూ.2.03 కోట్లతో కొనసాగుతున్న పనులు
- మహాశివరాత్రికి ముస్తాబైన రాజన్న ఆలయం



రాజన్న ఆలయ ఆవరణలో భక్తుల కోసం వేసిన చలువ పందిళ్లు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల నిర్వహించే మహాశివరాత్రి జాతరకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారుగా రూ.2 కోట్ల 3 లక్షల 90వేల అంచనా వ్యయంతో జాతర ఏర్పాట్లు వేగంగా చేపడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రాజన్న ఆలయానికి రానున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ నేతృత్వంలో నిత్యం క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. మహాజాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. దీంతో మూడు రోజుల ముందు నుంచే రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతూ వస్తోంది.

అలరించనున్న కళాకారులు..

మహాశివ రాత్రి జాతరను పురస్కరించుకుని రాజన్న ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో ప్రత్యేకంగా శివార్చన వేదికను తయారు చేస్తున్నారు. సుమారు లక్ష నుంచి రెండు లక్షల మంది కూర్చొని వీక్షించేందుకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటుగా రెండు రాష్ట్రాల నుంచి ప్రముఖ కళాకారులు తమ ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. సుమారుగా 800 మంది కళాకారులు ఆయా విభాగాల్లో తమ కళను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

భక్తులకు అందుబాటులో 4 లక్షల లడ్డూలు..

మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు రాజన్న ప్రసాదాన్ని అందించేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల తాకిడి దృష్టిలో పెట్టుకుని భక్తులకు సుమారు 4 లక్షల లడ్డూలను తయారు చేస్తున్నారు. రాజన్న ఆలయ లడ్డూల తయారీ కేంద్రంలో 30మంది సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. అయితే శివరాత్రి జాతర సమీపిస్తుండటంతో అదనంగా 18మంది సిబ్బందిని ఏర్పాటు చేసి అడ్డూల తయారీలో వేగంపెంచారు. పాత ఆంధ్ర బ్యాంకు సమీపంలో, రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంతో పాటు శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో లడ్డూలు భక్తులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు మూడు కల్యాణకట్టలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

3200 మంది సిబ్బందితో ఏర్పాట్లు..

మహాశివరాత్రి జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారని ఆలయాధికారులు అంచనా వేశారు. సుమారు 3వేల 2 వందల మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రాజన్న ఆలయానికి బస్సుల్లో వచ్చే భక్తులు తిప్పాపూర్ బస్టాండులో బస్సు దిగిన వెంటనే రాజన్న ఆలయ గుడి చెరువులోకి వచ్చేందుకు ఉచితంగా 14 మినీ బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 2వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పారిశుధ్యం లోపించకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో మరో 1200 మంది సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజన్నకు అత్యంత ప్రతిమైన కోడె మొక్కు చెల్లించుకునేందుకు ఆలయం లో నాలుగు షిఫ్టుల్లో కోడెలను భక్తులకు అందు బాటులో ఉంచేందుకు సిద్ధం చేశారు. ఒక్కో షిఫ్టులో 60 కోడెలను భక్తులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, భక్తుల కోసం తయారు చేస్తున్న లడ్డూలు

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, టీజీవో, ఇతర నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇదివరకే రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసు కెళ్లినట్లు, పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పెండింగ్ బిల్లులు, హాస్టల్ ఉద్యోగుల సమస్యలను వివరించానన్నారు. ఏప్రిల్‌లోగా పెండింగ్ బిల్లులు, 2డీఏలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. టీఎన్‌జీవో సర్వీసెస్‌లకు మున్సిపల్ అధికారులు టాక్స్ వేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లగా టాక్స్ మాఫీ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశిస్తానన్నారని తెలిపారు. త్వరలో టీఎన్‌జీవో 80వ వార్షికోత్సవాన్ని హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఈ సమావేశంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహాస్వామి, రాగి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, ఎంఏ హమీద్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాలుగో తరగతి ఉద్యో గుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, శంకర్, సునీత, సబిత, కొండయ్య, నగేశ్, శైలజ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య

- కృష్ణహరి, ఎంఈవో, ఎల్లారెడ్డిపేట



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంఈవో : ప్రజలు, ప్రజాప్రతినిధులు,యువజన, మహిళ సంఘాలను భాగస్వాములను చేస్తున్నాం. ప్రైవేటుపాఠశాలలకు పిల్లలను పంపించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం విద్యార్థులకు అమలుచేస్తున్న వివిధ పథకాలను వివరించి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో : ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ సమస్యలను తెలుసుకుంటున్నాం. తరగతిగదులు, వంటగదులు, రక్షిత మంచి నీరు, మూత్రశాలలు లేని పాఠశాలల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు?

ఎంఈవో : మండలంలో 450 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిలోని సందేహాలను నివృత్తి చేస్తున్నాం.

- ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి)

అలంకారప్రాయంగా మార్కెట్ షెడ్లు..

- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్ షెడ్డు



నిరుపయోగంగా ఉన్న చేపల మార్కెట్ షెడ్డు

ముస్తాబాద్, ఫిబ్రవరి 21 (ఫిబ్రవరి) : మండల కేంద్రంలోని పోతుగల్ రహదారి లోగల చేపల షెడ్డు, కూరగాయల మార్కెట్ షెడ్డు పదిహేనేళ్లుగా నిరుప యోగంగా మారాయి. కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ లేకపోవడంతో రోడ్లపైనే అమ్ముకుంటూ విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారని 2011 సంవత్సరంలో జడ్పీటీసీ, బీఆర్‌జీఎఫ్ నిధులు దాదాపు రూ. 10లక్షలు వెచ్చించి కూరగాయల మార్కెట్‌ను, మత్స్య శాఖ నిధుల నుంచి చేపల మార్కెట్ యార్డును నిర్మిం చారు. అప్పటి పౌర సరఫరాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కె తారకరామారావు చేతులమీదుగా చేపల మార్కెట్ యార్డు, కూరగాయల మార్కెట్‌ను ఒకే రోజు ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారు. రోడ్డుకు దూరంగా ఉందనే కారణంతో పాటు కూరగాయల మార్కెట్ షెడ్ ఇరుకుగా ఉందనే విక్రయదారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీనికితోడు అధికారులు కూడా అమ్మకందారులు వచ్చేలా చొరవ చూపడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన మార్కెట్ షెడ్డులు వినియోగంలోకి రాక ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో మరోవైపు మందు బాబులకు అడ్డాగా మారిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చౌడాలమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ



మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమారంపేట గ్రామంలో జరుగుతున్న చౌడాలమ్మ ఉత్సవాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సంఘ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, అంతగిరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మొక్కులు తీర్చుకున్నారు. జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, నాయకులు చెరుకుపల్లి రాజిరెడ్డి, బుర్ర బాలకిషన్, రాములుతో పాటు సంఘసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణలో ఆయాలే కీలకం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సంరక్షణలో ఆయాల విధులు కీలకమని సీడీపీవో ఉమారాణి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీడీపీవో ఉమారాణి హాజరై మాట్లాడారు. ఆయాలు సమయపాలన పాటించి పిల్లలను శ్రద్ధగా చూసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ టీచరు, హెల్పరుల పదోన్నతి, నియామకం, బదిలీ తదితర అంశాలను సీడీపీవో ఉమారాణి వివరించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు కళావతి, సంతోషి, ఆయాలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రాయితీతో..

(5వ పేజీ తరువాయి)

ఉండగా 16,113దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1,260 దరఖాస్తులు పరిష్కరించారు. 14,853 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో ప్లాట్‌కు గత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీసం రూ 20 నుంచి రూ 50 వేల వరకు ఆదాయం లభిస్తుంది. దీని ప్రకారం కనీసం రూ 40 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుల్లో సిరిసిల్ల మున్సిపాల్టీలో 10వేల 493 దరఖాస్తులు, వేములవాడ మున్సిపాల్టీలో 16336 దరఖాస్తులు వచ్చాయి. గ్రామపంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 20గ్రామపంచాయతీల్లో 645దరఖాస్తులు, చందుర్తిలో 15గ్రామపంచాయతీల్లో 213 దరఖాస్తులు, ఇల్లంతకుంటలో 24 గ్రామపంచాయతీల్లో 1054 దరఖాస్తులు, గంభీరావుపేటలో 17 గ్రామపంచాయతీల్లో 861దరఖాస్తులు, కోనరావుపేటలో 15 గ్రామపంచాయతీల్లో 277 దరఖాస్తులు, వేములవాడ అర్బన్ మండలంలో తొమ్మిది గ్రామపంచాయతీల్లో 3,702 దరఖాస్తులు, ముస్తాబాద్ మండలంలో 1,074 దరఖాస్తులు, ఎల్లారెడ్డిపేట మండలంలో 16గ్రామపంచాయతీల్లో 3,949 దరఖాస్తులు, తంగళ్లపల్లిలో 26 గ్రామపంచాయతీల్లో 3,784 దరఖాస్తులు, వేములవాడ రూరల్ మండలంలో 15 గ్రామపంచాయతీల్లో 214 దరఖాస్తులు, రుద్రంగిలో రెండు గ్రామపంచాయతీల్లో 304 దరఖాస్తులు, వీర్నపల్లిలో మూడు గ్రామపంచాయతీల్లో 71 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలనకు క్లస్టర్‌లుగా విభజించి వెయ్యి దరఖాస్తులకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. అధికారులకు ఇతర సర్వేలు రావడంతో పెండింగ్‌లోనే పడిపోయింది. క్రమబద్ధీకరణ కోసం దాదాపు ఐదేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమ లేఅవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు 2015 నుంచి వివిధ దశల్లో లే అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించింది. అప్పుడు వచ్చిన దరఖాస్తులను రెండేళ్ల పాటు పరిశీలించి క్రమబద్ధీకరించారు. మళ్లీ 2020 ఆగస్టులో ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని తెచ్చింది. లేఅవుట్ క్రమబద్ధీకరణలో దరఖాస్తులు ఆహ్వానించారు. ప్లాట్లకు సంబంధించి రూ. వెయ్యి చొప్పున, లేఅవుట్ క్రమబద్ధీకరణకు రూ.10వేల చొప్పున చెల్లించి దరఖాస్తులు సమర్పించారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి భవన నిర్మాణ అనుమతుల్లో ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించినా క్రమబద్ధీకరణ జరగలేదు. తాజాగా ప్రభుత్వం మార్చి31లోగా చార్జీలు చెల్లిస్తే 25శాతం రాయితీకి సంబంధించిన జీవో 28 విడుదల చేయడంతో దరఖాస్తుదారులు ముందుకు వస్తారని భావిస్తున్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి అరెస్టులు..

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పనితీరును ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం చూస్తుంటే సిరిసిల్ల జిల్లాలో ఎమర్జెన్సీ రోజులు వచ్చేలా కనిపిస్తున్నాయని బీఆర్‌ఎస్ నేత సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు ఆగ్రహం వ్యక్తంచేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన మాటున బీఆర్‌ఎస్ నేతలపై కక్ష సాధింపు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన సామాన్య రైతు అబ్బాడి రాజిరెడ్డిని శుక్రవారం అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్ని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు ముత్యంరెడ్డి, అంకారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన యువకుడు..

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన జి వెంకటేష్ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారి పడగా, అగ్నిమాపక కేంద్రం అధికారి సిబ్బందితో కలిసి వెళ్లి అతడిని రక్షించారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, రచయిత అఖిల భారత రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం హాజరయ్యారు. ప్రిన్సిపాల్‌జయ, వైస్‌ప్రిన్సిపాల్ రెహనాఇఫ్రత్, తెలుగు విభాగం అధ్యపకులు విజయ, లావణ్య పాల్గొన్నారు.

కాగా, సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనం నిర్వహించారు. పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో శుక్రవారం తెలుగు భాష గొప్పతనం గురించి అవగహన కల్పించారు. కరస్పాండెంట్ రాజ్‌కుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

● చందుర్తి : మండలంలోని ఎంపీపీఎస్ నర్సింగపూర్ పాఠశాలలో జరిగిన కార్యక్మంలో నర్సింగాపూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు జలంధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎం.అనిత, కే.శ్రీధర్, బి.రాజు, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముత్యాల నరేందర్, కాల్వ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు సిద్ధమైన ప్రభుత్వ పాఠశాల



వేడుకలకు సిద్ధమైన హన్మాజిపేట పాఠశాల

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మండలంలోని హన్మాజిపేట ప్రభుత్వ పాఠశాల 75 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవాలకు ముస్తాబైంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాల గ్రామ ప్రజల సహకారంతో 1949వ సంవత్సరంలో ఏర్పాటైంది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి(సినారె), ఒగ్గు కళాకారుడు మిద్దె రాములు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ సంకసాల మల్లేశలాంటి పలువరు ప్రముఖులు ఈ పాఠశాలలో విద్యాబుద్ధులను నేర్చుకున్నవారే. రాజ్యసభకు ఎన్నికైన తర్వాత సినారె నిధులు కేటాయించి పాఠశాల నిర్మాణానికి సహకరించారు. ప్రస్తుతం హన్మాజిపేట ప్రాథమిక పాఠశాలలో 112మంది విద్యార్థులు, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 203 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి ఆస్తులపై విచారణ చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆస్తులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సింగారం గ్రామ శివారులో ఆగయ్య 8 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి చెరువు పక్కన ఉన్న భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గతంలో వెంకటాపూర్ శివారులోని ఆయన సతీమణి పేరిట ప్రభుత్వ భూమి పట్టా చేసుకున్నారని ఆరోపించారు. ఆగయ్య ఆస్తులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, అంజయ్య, రాజుకుమార్, రఫీక్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ప్రజలపై అధికార యంత్రాంగం కొనసాగిస్తున్న కక్ష సాధింపు చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు వేములవాడలోని తన నివాసంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్‌తో పాటు మిగతా అధికారులందరూ ఎవరి కనుసన్నల్లో పనిచేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. అధికారులు కక్ష సాధింపు వైఖరితో ప్రజలను ఇబ్బందులపాలు, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వేధింపులకు గురవుతున్న ప్రజల పక్షాన తాము ఉంటామన్నారు. కలెక్టర్ అనాలోచితంగా పాలశీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేయడంతో పాడి రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. సమావేశంలో రుద్రంగి సెస్‌డైరెక్టర్ ఆకుల గంగారం, రామతీర్థపు రాజు, మల్యాల దేవయ్య, నిమ్మశెట్టి విజయ్, కొండ కనకయ్య, సిరిగిరి రామచంద్రం, నరాల శేఖర్, ముద్రకోల వెంకటేశం, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మంతెన సంతోష్, గోపు పర్శరాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో శ్రీ దుర్గాంబ నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని రెడ్డి సంఘం అధ్యక్షుడు నాయిని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రోజున గ్రామ దేవతల పూజ, గణపతి పూజ, కలశ యాత్ర, శోభాయాత్ర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం నుండి ఆదివారం వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.

సాగునీరందించి ఆదుకోవాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా ఆరెపల్లి గ్రామానికి సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు శుక్రవారం మండలపరిషత్ కార్యాలయానికి చేరుకొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుండి డీ5 కెనాల్ ద్వారా రేపాక మీదుగా బెజ్జంకి మండలం కల్లెపెల్లి గ్రామానికి నీరు వెలుతుందన్నారు. మధ్యలో ఉన్న ఆరెపల్లి గ్రామానికి నీరు ఇచ్చినట్లయితే 200 ఎకరాలలో పంటలు ఎండిపోకుండా ఉంటాయన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తెచ్చినామన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు అండగా నిలువాలని కోరారు. వీరిలో రైతుసంఘ నాయకుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, గుడికందుల భూంరెడ్డి, కూస పవన్‌రెడ్డి, మోహన్‌రావు, చంద్రారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతు అరెస్ట్

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో ప్రభుత్వం భూమిని అక్రమంగా కబ్జాచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతు అబ్బాడి రాజిరెడ్డిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. జిల్లెల్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 1183లో ఉన్న ప్రభుత్వ భూమిలో 30గుంటల భూమిని అబ్బాడి రాజిరెడ్డి కబ్జా చేసుకోవడంతో పాటు పట్టాలను సైతం తీసుకున్నాడని తహసీల్దార్ జయంత్‌కుమార్ శుక్రవారం ఉదయం రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో రాజిరెడ్డిపై కేసును నమోదు చేసిన అరెస్ట్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

హోంగార్డుకు చెక్కు అందజేత

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న హోంగార్డ్ రమేష్‌కు జిల్లా పోలీసులు అండగా నిలిచారు. రమేష్ వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేసి పోలీస్ అధికారులు, సిబ్బంది బాసటగా నిలిచారు. ఆర్‌ఐలు మధుకర్, యాదగిరి సిబ్బందితో కలసి పెరలసిస్‌తో బాధపడుతున్న హోం గార్డ్‌ని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం తోటి అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా లక్ష రూపాయలు జమచేసి హోంగార్డ్‌కు అందించారు.

సంక్షిప్త సమాచారం..

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి, సీతాలమ్మ కళ్యాణ మహోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సావాల్లో పాల్గొన్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావును ఆలయ కమిటీ అధ్యక్షుడు శరయ్య ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శరయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, సర్వర్‌పాషా, దీటి నర్సింలు, భరత్, సత్తయ్య , కోడె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో ఇటీవల మృతిచెందిన పెంటారెడ్డి కుటుంబాన్ని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు రామచంద్రారెడ్డి ,బుగ్గారెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి : మండలంలోని భూక్యతండాలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి, ఎద పరీక్షలను నిర్వహించారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాములు, గోపాలమిత్ర సిబ్బంది ప్రవీ ణ్ నాయక్, భూపతి, పాల్గొన్నారు.

పాడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు అందె సుభాష్ ఆరోపించారు. మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రహారంలోని పాల శీతలీకరణ కేంద్రానికి అనుమతులు లేవని పేర్కొంటూ మూసివేశారన్నారు. రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసి రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు సందీప్, రాజం, రమేశ్, వెంకట్‌రెడ్డి, నర్సింలు, నాగరాజు, తిరుపతినాయక్, మురళీమోహన్‌గౌడ్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ ఏది?



మొక్కలను మేస్తున్న మేకలు

రుద్రంగి ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలోగల డివైడర్‌లో పది రోజుల క్రితం కుండీలను ఏర్పాటుచేసిన మొక్కలు రక్షణ కరువైంది. సుమారు 300 నుంచి 400 రూపాయల చొప్పున విలువగల మొత్తం 30 మొక్కలను నాటారు. వాటికి రక్షణ లేకపోవడంతో మేకలు మేస్తున్నాయి. మొక్కలకు నీరును పోయకపోవడంతో ఎండిపోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మొక్కలకు ట్రీగార్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బతుకమ్మ చీరల బకాయిలపై బహిరంగ చర్చకు సిద్ధం

- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కొత్త ప్రభుత్వం వచ్చాక రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్, బతుకమ్మ చీరలు ఎగొట్టిందని, కార్మికులకు 365 రోజులు పని కల్పిస్తామంటూ 2కోట్ల 21లక్షల మీటర్లకు మాత్రమే ఆర్డర్లు ఇచ్చిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ప్రవీణ్ మాట్లాడారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరల గురించి ఐక్యవేదిక మాట్లాడిన దానిపై ప్రజలకు తేటతెల్లం చేయల్సిన అవసరం ఉందన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం, కార్మికుల ఆత్మహత్యలపై నాడు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి వస్త్ర వ్యాపారులతో సహా తాము తీసుకెళ్లామన్నారు. కార్మికులకు నెలకు వస్తున్న వేతనాలపై స్పందించారని ఆత్మహత్యల నివారణకు వారికి నెలకు రూ.15వేల వరకు వచ్చేలా చేయాలని బతుకుదెరువు కోసం బతకమ్మ చీరలను తీసుకొచ్చారన్నారు. వస్త్ర పరిశ్రమ బాగుంటే అందరు బాగుంటారని కేసీఆర్ ఆలోచన చేశారని అన్నారు. మొట్టమొదటి సారిగా 2014-15 సంవత్సరంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు రూ 50 కోట్లు ఇచ్చారని చివరిగా 2023-24 సంవత్సరంలో బతుకమ్మచీరల ఆర్డర్లు రూ 526 కోట్లు ఆర్డర్లను ఇచ్చారన్నారు. 2014 నుంచి 2023 వరకు మొత్తం బతుకమ్మ చీరలు, ఆర్వీఎం ఆర్డర్లు రూ3312కోట్లు ఇచ్చారన్నారు. బతుకమ్మ చీరలు బకాయిలు రూ.270 కోట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎగ్గొట్టిపోయిందని ఆరోపణలు చేస్తున్నారని, కొత్త ప్రభుత్వం వచ్చి 14నెలలు గడుస్తున్న బకాయిలను ఎందుకు విడుదల చేయలేదన్నారు. బకాయిలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని అంబేద్కర్ చౌరస్తా లేదా గాంధీచౌక్ వద్దకు రేపు 10గంటలకు రావాలని సవాలు విసిరినారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, సబ్బని హరీష్, గెంట్యాల శ్రీనివాస్, రిక్కుమల్ల సంపత్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని నాంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొజ్జ భారతి, సింగిల్‌విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, నాయకులు జడల శ్రీనివాస్, పోషవేని నాగరాజు, జడల రవీందర్, చిలువేరి సత్తయ్య, చిలువేరి జ్యోతి, ఎండి షాదుల్లా, చిలివేరి శ్రీనివాస్, వెలుపుల రాజేందర్ తదితరులు ఉన్నారు.కాగా బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ ఆధ్వర్యంలో నందికమాన్ చౌరస్తాలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

● ఇల్లంతకుంట : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు శుక్రవారం వేర్వేరుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కందికట్కూర్ గ్రామంలో, బీజేపీ బలపర్చిన అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా దాచారం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బిగుళ్ల విజయ్, ముత్యం అమర్, యాస తిరుపతి, కిషోర్‌గౌడ్, బీజేపీ నాయకులు నాగసముద్రాల సంతోష్, దేశెట్టి శ్రీనివాస్, అశోక్‌యాదవ్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం గోపిని నాయకులు సన్మానించారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల అధ్యక్షులు లక్పతి నాయక్, పొన్నాల తిరుపతి రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు దాసరి గణేష్, మాడుగుల లక్ష్మీరాజం, ఆసాని రామలింగారెడ్డి, సందవేణి రాజు, జిందం సంతోష్, బట్టు పిర్యా, బండారి మహేష్, ప్రకాష్ రఘుపతి, సంతోష్ పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్ ఆధ్వర్యంలో నూకలమర్రిలో ప్రచారం నిర్వహించారు. సామల్ల రాజు, చిట్టనేని హరిచరణ్, మేడుదులశ్రీను, మల్యాల గణేష్, సామల్ల రుఖబ్, గుగులోతు మహేష్, రోమాల ప్రశాంత్, సామల్ల రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌లోని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కుడికాల రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వెల్మల తిరుపతిరెడ్డి, కామిని నళినీకాంత్, గుండ్లపెల్లి గౌతమ్, శ్రీనివాస్, ఆర్‌ఎంపీ పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసి రాజమల్లు, అధికార ప్రతినిధి బోగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీస్టాల్ తొలగింపుపై ఆందోళన

- మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల బైఠాయింపు
- మాజీ మంత్రి కేటీఆర్ జోక్యంతో విరమణ



బాధితుడికి భరోసా కల్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో టీస్టాల్ మూసివేత వివాదం రోడ్డెక్కింది. బుధవారం ట్రేడ్ లైసెన్స్ లేదని మున్సిపల్ అధికారులు టీస్టాల్‌ను మూసివేశారు. శుక్రవారం టీస్టాల్ డబ్బా(కంటైనర్)ను తొలగించారు. దీంతో తమను రోడ్డున పడేశారంటూ టీస్టాల్ నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి మున్సిపల్ గేటు ఎదుట బైఠాయించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌పై అభిమానంతో ఆయన పేరును పెట్టుకొని ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం మున్సిపల్ అధికారులు శ్రీనివాస్ టీ స్టాల్‌ను మూసివేశారు. కేటీఆర్ ఫ్లెక్సీని తొలగింపజేశారు. ఈ విషయమై బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపి స్టాల్‌ను తెరిపించారు. ఈ వివాదం కొనసాగుతుండగానే శుక్రవారం పోలీస్ బందోబస్తు మధ్య మున్సిపల్ అధికారులు టీస్టాల్ డబ్బాలను ట్రాక్టర్‌లో తరలించి మున్సిపల్‌కు చెందినే సినారె కళామందిరం కంపౌండ్‌లో ఉంచారు. దీంతో నిర్వాహకులు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో నిరసనకు దిగారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్‌లు బాధిత కుటుంబానికి మద్దతుగా నిలిచారు. మాజీ మంత్రి కేటీఆర్ బాధితులతో ఫోన్‌లో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపులకు భయపడవద్దని, పార్టీ తరఫున హోటల్ ఏర్పాటు చేయిస్తామన్నారు. త్వరలోనే వచ్చి హోటల్ ఓపెన్ చేయిస్తానని భరోసా ఇవ్వడంతో శ్రీనివాస్ ఆందోళనను విరమించారు.